# కళ్ళు

"ఎంత పెద్దకళ్లో... చెంపకు చారడేసి... అమ్మాయిలకుండాల్సిన కళ్ళు... అరవింద దళాయతాక్ష... నాకెంత జెలసీ అన్పిస్తుందో తెలుసా... అంతందమైన కళ్ళు నాకుంటేనా... ఓహ్" అంది రవళి.

ఆదివారం కావటం వల్ల రామక్రిష్ణాబీచ్ చాలా సందడిగా ఉంది. పరిచయమైన క్షణం నుంచీ తన ధ్యాసంతా నాకళ్ళమీదే. "నాదిష్టి తగుల్తుందేమో... ఎందుకైనా మంచిది కళ్ళకి కాటిక రాయరాదూ... అందానికి అందం.. దిష్టి తగలకుండా రక్షణ" అంది కొంటెగా నవ్వుతూ.

ఆ మాటలకు మందహాసం చేస్తే "అచ్చం అమ్మాయిలా ఆ సిగ్గు పడటం ఏంటో... నాకేదో అనుమానంగా ఉంది. మన పెళ్ళయ్యాక నాకొంప ముంచవుగా మహానుభావా" అంది అల్లరిగా.

ఎదురుగా అలల కేరింతలతో సందడిచేస్తున్న సముద్రానికీ రవళికీ ఎన్ని సారూప్యతలో..

తను హైద్రాబాద్‌లో కంప్యూటర్ యింజనీరింగ్ చదివింది. 'వైజాగ్‌లో ఉద్యోగం అనగానే యిక్కడి సముద్రం గుర్తొచ్చి రెక్కలు కట్టుకుని వాలిపోయాను తెలుసా... మా హైద్రాబాద్‌లో ట్యాంక్‌బండ్, గండిపేటచెరువు తప్ప సముద్రం లేదుగా. నాకు సముద్రమంటే ఎంతిష్టమో' అంటూ చిన్నపిల్లలా తుళ్ళిపడే రవళి..

ఆంధ్రా యూనివర్శిటీలో రీసెర్చిస్కాలర్‌గా జాయినైన నాకు ఓ ఆదివారం సాయంత్రం యిక్కడే ఈ సముద్రం సాక్షిగా తను పరిచయమై, అది స్నేహంగా బలపడింది. ఎంత

పనివత్తిడి ఉన్నా ఆదివారం సాయంత్రాలు కల్సుకోవడం మాత్రం తప్పనిసరి ఆనవాయితీ మా యిద్దరికీ.

"వచ్చేవారం తల్చుకుంటే భయమేస్తోంది. కంప్లీట్ చేయాల్సిన వర్క్ చాలా ఉంది. డెడ్‌లైన్ దగ్గరబడేకొద్దీ నా బీ.పీ పెరిగిపోతోంది. ఉన్న టెన్షన్‌కితోడు బుధవారం మనస్విత వస్తోంది. అది ఉన్న నాలుగురోజులు దానివెంటే ఉండాలంటుంది. ఏం చేయాలో తెలీటం లేదు" అంది దిగులుగా మొహం పెట్టి...

"మనస్విత ఎవరు?"

"ఓహ్... నీకు మనస్విత పరిచయం లేదుకదా. మాపిన్ని కూతురు. నాకంటే మూడేళ్ళు చిన్నది. డిగ్రీ ఫైనలియర్లో ఉంది. ఈసారి పరిచయం చేస్తాలే. వెరీ యింటరెస్టింగ్ క్యారెక్టర్. నువ్వు తప్పకుండా కల్సుకోవాలి"

"నేనామెని కలవటం గురించి ఆలోచించడం లేదు. నీ పనివత్తిడి గురించి వర్రీ అవుతున్నా. వైజాగ్‌కి మొదటిసారి వస్తోందా?"

"ఔను"

"ఐతే మటుకు తనున్న నాలుగు రోజులు నువ్వు తోడుండాలని ఏముంది? నీపని నువ్వు చూసుకో తనపని తను చూసుకుంటుంది"

"అలా వీలు కాదు. తను తోడు లేకుండా బైటికి కదల్లేదు"

"ఏం... భయమా?"

"చాలా ధైర్యస్థురాలు.. తనకు కళ్ళు లేవు"

"అయ్యో... సారీ.. దేవుడెందుకిలా చేస్తాడో కదా?"

"అలా చేసింది దేవుడు కాదు. మనిషే... మానవ మృగం. తను యింటర్లో ఉన్నప్పుడు ప్రేమిస్తున్నానంటూ వెంటబడేవాడట. తిరస్కరించిందని తెలిసి మొహంమీద యాసిడ్‌పోసి పారిపోయాడు. రెణ్ణెల్లు హాస్పిటల్లో ఉండింది. మొహానికి జరిగిన నష్టం కొంతవరకు ప్లాస్టిక్‌సర్జరీల ద్వారా పూడ్చినా కళ్ళు మాత్రం రావని డాక్టర్లు చేతులెత్తేశారు."

"వాణ్ని ఏం చేశారు?"

"కోర్టులో కేస్ నడిచింది. వాడికి శిక్ష పడింది. ఏం జరిగినా పోయిన కళ్ళయితే రావుగా"

"ఎంతటి దారుణం కదా.ప్రేమ సహజంగా పుట్టాలని, బలవంతంగా తెప్పించేది కాదని వీళ్ళకెప్పుడర్థమౌతుంది? లాలిత్యం, దైవత్వం ఉండాల్సిన ప్రేమలో ఈ రాక్షసత్వం ఏమిటి? దాన్ని ప్రేమంటారా... తను ఎంతటి డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయి ఉంటుందో... పుట్టుకతో కళ్ళులేకున్నా అంత బాధగా ఉండదేమో... సగంలో కళ్ళుపోతే తట్టుకోవటం కష్టమే."

"దానికి సింపతీ చూపించేవాళ్ళంటే కోపం. పొరపాటున అయ్యోపాపం అన్నావా పైనబడి నీకళ్ళు పీకేస్తుంది. జాగ్రత్త" అంది తర్జని చూపిస్తూ.

"అనన్లే... ఓ పని చేద్దాం. ఆ నాలుగు రోజులు నేను తనకు తోడుగా ఉంటాను... నీకభ్యంతరం లేకపోతే..." అన్నాను.

"అభ్యంతరమా... నీ మొహంలే... నీకంత సీన్ లేదుగానీ బాబ్బాబు అలా చేయి... నా నెత్తిమీద పాలుపోసినవాడివౌతావు" అంది చేతులు జోడిస్తూ...

"అభయం యిస్తున్నాను...నిశ్చింతగా ఉండు" అని నాటకంఫక్కీలో అన్నానే కానీ మనసులో బెరుగ్గానే ఉంది. కళ్ళు లేని అమ్మాయిని బైటికి పిల్చుకెళ్ళటం అంటే మాటలా... చేయి పట్టుకునే నడిపించాలి.. మన కళ్ళతో చూస్తున్నదాన్ని ఆ అమ్మాయికి వివరిస్తూ ఉండాలి. తనడిగే ప్రశ్నలన్నింటికి ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి... ఒకరోజైతే పర్లేదు... నాలుగు రోజులంటే కష్టమే... ఐనా మాటిచ్చాక వెనక్కి తీసుకోలేని పరిస్థితి.

ఆ రోజు రానే వచ్చింది. "నాకు ఎనిమిదిన్నరకల్లా క్యాబ్ వస్తుందని తెల్సుగా.నువ్వ ఓ అరగంట ముందే యిక్కడుండాలి. మనస్వితని నీకు పరిచయం చేసి వెళ్ళిపోతాను" అంది రవళి.

సరిగ్గా ఎనిమిదింటికి వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కాను. తలుపు తీసినమ్మాయి "హాయ్ సుధాకర్ గారూ... లోపలికి రండి. అక్క రెడీ అవుతోంది. జస్ట్ ఫ్యూమినిట్స్" అంది నవ్వుతూ. నేనాశ్చర్యంలోంచి తేరుకునేలోపలే "ఐయాం మనస్విత... ప్లీజ్ టు మీట్ యూ" అంది కుడిచేయి ముందుకు చాపి. ఈ అమ్మాయికి కళ్ళు లేవని రవళి చెప్పింది కేవలం నన్ను ఆటపట్టించడానికా అన్పించింది.

తను ఓ కుర్చీ లాగి "కూచోండి" అంది. మరో కుర్చీని జరుపుకుని దాంట్లో కూచుంది.

ఎక్కడా తడుముకోవటం లేదు. యిందాక నావైపు చూసి నవ్వినపుడూ, కరచాలనం కోసం చేయిచాపినపుడు... పర్‌ఫెక్ట్‌గా చేసింది.

"ఏం మాట్లాడరా... మౌనంగా ఉండేవాళ్ళని నేను తట్టుకోలేను. మీరందరూ శబ్దాల్ని వింటారు. నేను చూస్తాను. ఓ... మీరెందుకలా ఉన్నారో చెప్పనా... మిమ్మల్నెలా గుర్తుపట్టానని ఆశ్చర్యపోయి ఉంటారు. ఔనా... వెరీ సింపుల్... మీరు ఎనిమిదింటికల్లా వస్తారని అక్క చెప్పింది. సరిగ్గా ఎనిమిదింటికి కాలింగ్‌బెల్ మోగితే మీరే అయిఉంటారని వూహించా. విన్పించే శబ్దాలు, కొద్దిగా సమయస్ఫూర్తి, కొద్దిగా ఇమాజినేషన్... ప్రస్తుతం నా కళ్ళకు ప్రత్యామ్నాయాలు... కుర్చీ ఎలా జరిపాననా... నిన్న కదా వచ్చాను. ఈ యింట్లోని ప్రతి వస్తువునీ తడిమి ఎక్కడుందో గుర్తు పెట్టుకున్నాను. ఎన్ని అడుగులువేస్తే ఏదొస్తుందో చూసుకున్నాను" అంటూ నవ్వి "అంతః చక్షువులతోలెండి" అంది.

రవళి ఆఫీసుకెళ్ళబోతూ "సుధా... మనస్విత బాధ్యత ఈ నాలుగురోజులూ నీదే. ప్లీజ్ టేక్ కేర్ ఆఫ్ హర్. ఉదయం లేట్‌గా లేచాను. బ్రేక్‌ఫాస్ట్ చేయటం కుదరలేదు. నేను మా క్యాంటీన్లో లాగించేస్తా. తన సంగతి నువ్వు చూసుకో" అంది.

"యిప్పుడు చెప్పండి. ఎక్కడి కెళ్ళాలి... ఏంపని మీదొచ్చారు" అని అడిగా.

"వైజాగ్ అందాల్ని చూడటంతప్ప మరోపని లేదు. మానాన్న చెప్పాడు. ఈ వూరు చాలా శోభాయమానంగా ఉంటుందని. పదండి. నాకు ఈ నాలుగురోజులు ఏంచూపిస్తారో మీ యిష్టం. మొదట మాత్రం బీచ్‌కెళ్దాం. సముద్రం చూసి చాలా రోజులైంది"

సముద్రాన్ని చూస్తుందా... యిందాక చెప్పినట్లు సముద్రాన్ని వింటుందేమో...

తనే గదికి తాళం వేసింది. నా సాయం లేకుండానే మెట్లుదిగి కిందికొచ్చింది.

స్కూటర్ వెనక కూచున్నాక "మొదట ఏదైనా హోటల్‌కి వెళ్దాం. ఆకలేస్తోంది" అంది.

హోటల్ దసపల్లా చేరుకున్నాక స్కూటర్ పార్క్‌చేసి తనచేయి పట్టుకుని మెట్ల వైపుకు నడిపించాను. మెట్లు ఎక్కుతూ "అటూ యిటూ కుండీల్లో పూల మొక్కలు పెట్టారు కదూ" అంది.

నేను యింత క్రితం చాలాసార్లు ఈహోటల్ కొచ్చాను. కానీ ఎప్పుడూ మెట్ల పక్కన పూలమొక్కల్ని గమనించలేదు. నిజమే... ఒక్కో మెట్టుకి యిరువైపులా అందమైన పూలమొక్కలు...

"గులాబీలు కూడా ఉన్నాయికదా... నాకెంతిష్టమో గులాబీలంటే... ఏ రంగు?"

మెట్లన్నీ ఎక్కాక పైన నిలబడి మరలా ఆ మొక్కలవైపు నిశితంగా చూశాను. ఔను.. గులాబీ మొక్కలు... పసుపు రంగు... తెలుపు రంగు... గులాబీ రంగు పూలు... తనకా విషయం చెప్పాను.

"మిగతావి డాలియాలా?"

"ఔను..."

"అనుకున్నాలెండి. కొన్ని మెట్లదగ్గరే గులాబీ పూల వాసనొచ్చింది. మిగతా మెట్లదగ్గర వాసన రాలేదు. కొన్ని పూలకి సువాసనలుంటే మరికొన్ని పూలు వాసన లేకున్నా అందంతో కనువిందు చేస్తాయి. మంచి హోటల్‌కి పిల్చుకొచ్చారు. గుడ్ యాంబియన్స్... యిప్పటి పోటీ ప్రపంచంలో హోటల్ బిజినెస్‌లో మనగలగాలంటే రుచికరమైన పదార్థాలతో పాటు అందమైన పరిసరాలుకూడా అవసరమే" అంది.

రెస్టారెంట్లోకెళ్ళి కూచున్నానన్న మాటేగాని ఆలోచన మాత్రం ఆ పూలమొక్కల దగ్గరే ఆగిపోయింది. నాకు రాని పూల సువాసనలు తనకెలా వచ్చాయి?

"నాకు మసాలా దోసె... కాఫీ" అంది ఆర్డర్ కోసం వచ్చిన స్టివార్డ్‌తో.

నాకో కాఫీ ఆర్డరిచ్చాను.

"ఏమాలోచిస్తున్నారు? గులాబీ మొక్కలున్నాయని ఎలా తెలిసిందనా... వాటి వాసన చాలా గమ్మత్తుగా ఉంటుంది. చాలా మృదువుగా ఉండే వాసన... మీరు మెట్లెక్కేటపుడు ఏదో ఆలోచనలో ఉండిఉంటారు. అందుకే మీరు గ్రహించలేదు. నేను మనసంతా పూలనుండి వచ్చే సువాసనలపైనే కేంద్రీకరించాను. అర్జునుడికి చెట్టుమీది పక్షికన్ను మాత్రమే కన్పించిందని భారతంలో చెప్తారే.. అలా... దేనిమీదైనా ఏకాగ్రతతో మనసు లగ్నంచేస్తే ఎవ్వరికీ వినపడని శబ్దాలు మనకు విన్పిస్తాయి. ఎవ్వరికీ కన్పడని దృశ్యాలు కన్పిస్తాయి" అంది.

నేను మెల్లగా కాఫీ చప్పరిస్తున్నాను.

తను తినటం ఆపి, "నా వెనకున్న టేబుల్‌దగ్గర చిన్నపాప ఎంత ముద్దుగా అల్లరిచేస్తుందో చూశారా... యిందాకటినుండి వింటున్నా. వాళ్ళమ్మ 'మీరు దాన్ని ముద్దుచేసి ఎలా పెంకిఘటంలా తయారుచేస్తున్నారో చూడండి' అని తన భర్తతో అంది. కాబట్టి పాపే అయిఉంటుంది. ఎన్నేళ్ళుంటాయి? ఎలాఉందో చెప్పరా ప్లీజ్" అంది.

అప్పటివరకూ వాళ్ళని గమనించనేలేదు... నా కళ్ళెదురుగా ఉన్నా కూడా... భర్తకి ముప్పయికి దగ్గిరగా ఉంటాయోమో... భార్య చాలా అందంగా ఉంది. వాళ్ళ పాపకి నాలుగేళ్ళు ఉండొచ్చు. చక్రాల్లాంటి గుండ్రటి కళ్ళు... గులాబీ రేకుల్లాంటి బుగ్గలు... లక్కపిడతలా ఎర్రటి నోరు.. బొమ్మలా ఉంది. ఆపకుండా మాట్లాడ్తూనే ఉంది. వాళ్ళమ్మ ఏదో అందని అలిగి బుంగమూతి పెట్టింది. దాని ఆల్చిప్పల్లాంటి కళ్ళలో ముత్యాల్లా మెరిసిన కన్నీళ్ళు. "ఎందుకు దాన్ని ఏడ్పిస్తావు... అడిగింది తెప్పిస్తే పోయేదిగా" అన్నాడతను. "ఏం తెప్పిస్తారు చెప్పండి. మొదట దోసె కావాలంది. అది వద్దని యిడ్లీ అంది. అది తెచ్చేలోపలే ఉప్మా అంది. యిప్పుడేమో వాళ్ళు తింటున్న పూరీ చూసి తనకూ పూరి కావాలంటోంది" అందామె కోపంగా. "అన్నీ తెప్పిస్తా. దానికేం కావాలంటే అది తింటుంది" అన్నాడతను నవ్వుతూ.

ఆపాప కిలకిలా నవ్వింది. ఈసారి నోట్లోంచి మంచిముత్యాలు రాలిపడ్డాయి. మనస్విత కూడా శబ్దం లేకుండా నవ్వింది.

"మన పక్కటేబుల్ దగ్గర ఓ అమ్మాయి అబ్బాయి పోట్లాడుకుంటున్నారు కదా... లవర్స్ అయిఉంటారు" అంది.

పక్కటేబుల్ వైపు చూసాను. డిగ్రీ స్టూడెంట్స్‌లా ఉన్నారిద్దరూ. అతను పల్చగా పొడవుగా ఉన్నాడు. అమ్మాయి కొద్దిగా బొద్దుగా, తెల్లగా ఉంది. ఆ అమ్మాయి స్వరాన్ని తగ్గించి మాట్లాడ్తున్నా అందులో కోపం స్పష్టంగా తెలుస్తోంది. అతను బతిమాలుకుంటున్నాడు. నాకైతే నాలుగైదుసార్లు అతను సారీ అనటం విన్పించింది.

ఐనా వెనకటేబుల్ దగ్గర ఎవరుకూర్చుని ఏంచేస్తున్నారో, పక్కటేబుల్ దగ్గర ఎవరు ఏవిషయంలో పోట్లాడుకుంటున్నారో ఈవిడకెందుకు... మనపని మనం చూసుకుంటే పోలా... అదేవిషయాన్ని మృదువైన పదాలుగా కూర్చి అడిగాను.

"నేను ప్రతి అనుభవంలో జీవించాలనుకుంటా... అనుభూతి చెందుతా. ఆ అనుభవాన్ని అనుభూతిని పదిలంగా గుండెల్లో దాచుకుంటా. బుల్లెట్ త్రూ ఏ ప్లమ్ పుడింగ్ అనే మాట విన్నారా... చాలామంది తమ జీవితాల్లో జరిగే చాలా అనుభవాల్లోంచి యిలానే దాటుకుంటూ వెళ్ళిపోతారు. ఏ జ్ఞాపకమూ మిగలకుండా... కొంత మంది ఆగి ఆ అనుభవంలో కొంత సమయం గడిపినా తామరాకు మీద నీటి బొట్టులా జారిపోతారు. నేనిపుడు దస్‌పల్లా అనే హోటల్లో సుధాకర్ అనే రీసెర్చ్ స్కాలర్‌తో కలిసి టిఫిన్ చేస్తున్నా. ఈ అనుభవాన్ని నేను సంపూర్ణంగా అనుభూతి చెందాలని ఆశిస్తాను. ఈ రెస్టారెంట్లోని వాతావరణం... మన చుట్టూ ఉన్న రకరకాల మనుషులు... యివన్నీ లేకపోతే ఈ దృశ్యం అసంపూర్తిగా మిగిలిపోతుంది."

తన ఆలోచన నాకు కొత్తగా వింతగా అన్పించింది.

"అర్థం కాలేదుకదా. కళ్ళు సలక్షణంగా కన్పిస్తున్న రోజుల్లో నాకూ అర్థమయ్యేది కాదు. కళ్ళు పోయాకే తెలిసింది... కళ్ళున్నప్పటి క్షణాల్ని... ఆ విలువైన కాలాన్ని ఎంతగా నష్టపోయానో... నేను చూశాననుకున్నవాటిని వేటినీ నేను సంపూర్ణంగా చూళ్ళేదు. కళ్ళతోచూస్తే సరిపోదనీ మనసుతో, హృదయంతో కూడా కలిపి చూసినపుడే నిజంగా చూసినట్లని నాకిప్పుడర్థమైంది" అంది.

బిల్లుతెచ్చి ముందు పెట్టాడు. పర్సులోంచి డబ్బులుతీసి బిల్‌ఫోల్డర్‌లో పెట్టబోతున్నప్పుడు అడిగింది. "టిప్ యిస్తున్నారా?"

"ఆ... వద్దా?"

"యివ్వండి... ఎంతిస్తున్నారు?"

"ఐదు రూపాయలు... చాలా యింకెక్కువివ్వనా?"

"చాల్లెండి. ఆ బిల్‌తో పాటు మీరిచ్చిన టిప్ చూసుకున్నప్పుడు సర్వర్ మొహంలోని భావాలు ఎలాఉన్నాయో చెప్పండి చాలు" అంది.

యింతకు ముందెప్పుడూ యిలా టిప్‌యిచ్చాక అతని హావభావాలు గమనించాలన్న ఆలోచనే రాలేదు. ఈసారి తనకోసమని శ్రద్ధగా గమనించాను. అతను భావరహితంగా ముఖం పెట్టి ఐదురూపాయల్ని తనజేబులో వేసుకున్నాడు. అదే విషయం చెప్పినపుడు మనస్విత

విచ్చుకున్న ముద్దబంతిపువ్వులా నవ్వింది. "నేనూహించాలెండి. టిప్ యివ్వడం కష్టమర్ల బాధ్యత అనుకుంటే అలానే ప్రవర్తిస్తాడని. అలాకాక అతని సర్వీసెస్‌కి మెచ్చి బహుమతిగా యిస్తున్నారనుకుంటే అతని మొహంలో కృతజ్ఞతాపూర్వకమైన భావం కన్పించేది."

రామక్రిష్ణాబీచ్‌లో మనుషులు పల్చగా ఉన్నారు. పదిగంటలు కావస్తోంది. అప్పటికే ఎండ చురుక్కుమంటోంది. షెడ్‌ఉన్న బెంచీమీద కూచున్నాం. సముద్రపు అలలమీద తేలియాడే నురగ ఎండపడి వెండి జలతారులా మెరుస్తోంది. మనస్విత చాలాసేపు మాట్లాడకుండా అలలరొద వింటూ కూచుంది... మధురమైన సంగీతం వింటున్నట్లు... మైమరచిపోయి...

ఓ పావుగంట తర్వాత నావైపు తిరిగి, "ఎంత హాయిగా ఉందో మనసుకి. సముద్రం నాతో వూసులాడుతున్నట్లు... ఎన్నాళ్ళనుంచో ఎదురుచూసిన నేస్తం కన్పడగానే కావిలించుకుని కన్నీళ్ళపర్యంతమైనట్లు... కబుర్ల ప్రవాహంలా మారి కమ్ముకున్నట్లు... సముద్రాలే లేకపోతే సృష్టిలోని సగం అందాల్ని మనం కోల్పోయేవాళ్ళం" అంది.

మరలా తనే, "అలల్ని చూశారా... మన వైపుకు పరుగెత్తుకొస్తున్న నీటి పాపాయిల్లా ఎంతందంగా ఉన్నాయో... ఈ శబ్దం వింటుంటే మనం హోటల్లో టిఫిన్ చేస్తున్నప్పుడు ఆపాప చేసిన అల్లరి గుర్తుకొస్తోంది. కెరటం ఉవ్వెత్తున పైకిలేచినపుడు దాన్నుంచి మంచుపొరలా లేస్తున్న నీటితుంపర్లు కన్పిస్తున్నాయా?" అంది.

సముద్రంఒడ్డున కూచున్నప్పుడు మాటలమధ్యలో చూపునోసారి సముద్రం వైపుకు మరల్చి యథాలాపంగా కెరటాలవైపు కొద్దిసేపు చూశాక మరలా మాటల్లో మునిగిపోవటం తప్ప తనుచెప్తున్న విషయం యింతకు ముందెన్నడూ చూళ్ళేదు.

ఎండలో మంచుకొండలా లేస్తున్న అలలవైపు పరిశీలనగా చూశాను. నిజమే... అల పైకిలేచినపుడు దానిపైన తుంపర్లు మిణుగురు పురుగుల్లా ఎగుర్తున్నాయి.

"వాటిమీద సూర్యకిరణాలు పడటంవల్ల అందులో బుల్లిబుల్లి యింద్రధనుస్సులు ఏర్పడి మొత్తంగాచూస్తే రంగురంగుల మంచుదుప్పటిలా కన్పిస్తుంది కదూ" అంది.

యిన్నాళ్ళూ చూడలేదుగానీ ఎంత అద్భుతమైన దృశ్యమో...

చప్పున నాకో అనుమానమొచ్చింది. తనకు చూపిద్దామని కదా తెచ్చాను... కానీ

తనే నాకు చూపిస్తోంది... యిన్నాళ్ళూ చూడని... చూసినా గమనించని అతి రమ్యమైన సుందర దృశ్యాల్ని...

సమయం పన్నెండు కావస్తోంది... ఎండ విపరీతంగా ఉంది. సముద్రం మీంచి వీస్తున్న గాలికూడా వేడెక్కింది.

"దార్లో ఏదైనా హోటల్‌కెళ్ళి లంచ్ చేసేద్దాం" అన్నాను.

"వద్దు... యింటికెళ్దాం. నేను వంట చేస్తాను. కబుర్లు చెప్పుకుంటూ వంట చేయటం.. కబుర్లు నంజుకుంటూ లంచ్ చేయటం బావుంటుంది కదా. భయపడకండి. నేను వంట బాగానే చేస్తాను" అంది సముద్రపు అలల కవ్వింపులా నవ్వుతూ.

"సాయంత్రం చల్లబడ్డాక మళ్ళా వద్దాం. చీకట్లో సముద్రం చూట్టానికి మిస్టిక్‌లా ఉంటుంది కదా" అంది.

చీకట్లో సముద్రం చూస్తుందా అనుకోబోయి ఆగిపోయాను. తనతో గడిపిన ఈ కొన్ని గంటల్లోనే నాకో విషయం అర్థమైంది. చీకటిలో ఉండటం వేరు... చీకటిని అనుభూతి చెందడం వేరు. తను చీకటినే చూడాలనుకుంటే అది సముద్రపు అలల్లా ఆమె గుండెల్లో పోటెత్తుతుంది. తను చీకటితో మమేకమైపోతుంది యిప్పటివరకూ సముద్రంతో మమేకమైనట్లు...

తను వంటచేస్తుంటే ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి చూస్తూ ఉండిపోయా... "నిన్న రాత్రి నేనే వంట చేసా. అక్క సాయపడింది. అప్పుడు బాగానే తడుముకున్నాలెండి. అన్నీ గుర్తుపెట్టుకున్నా. అందుకే తడుముకోకుండా చేయగలుగుతున్నా" అంది.

సాయంత్రం మరోమారు బీచ్‌లో షికార్లు చేశాక మరునాడు తనని కైలాసగిరి పిల్చుకెళ్ళాను. "నాకిక్కడ ఏమీ బాలేదు" అంది.

"అదేమిటి? వైజాగ్ వచ్చే టూరిష్టులందరూ తప్పకుండా ఇక్కడికొస్తారు."

"ప్రకృతి సౌందర్యం... చూసి అనుభూతి చెందాల్సిన విషయం... కానీ దేవుడు మాత్రం అనుభూతి చెంది చూడాల్సిన విషయం. భగవంతుడి అద్వితీయమైన సౌందర్యం చూడాలంటే మనసులోతుల్లోకెళ్ళి వెతుక్కోవాలి. యిలా కొండలమీదా, గుళ్ళలో కాదు. ఉన్నక్కడికైనా పార్కుకి పిల్చుకెళ్ళండి. పచ్చగా చెట్లుండాలి... రంగుల సేలయేళ్ళు

పరవళ్ళు తొక్కుతున్నట్లు రంగురంగుల పూలసందడి వినాలి" అంది.

ఆమె సాన్నిధ్యంలో నాలుగురోజులు నాలుగుక్షణాల్లా దొర్లిపోయాయి. ఆ సాయంత్రం ట్రెయిన్ ఎక్కించడానికి నేనూ రవళి వెళ్ళాం.

"పని వత్తిడి... నీతో సరిగ్గా గడపలేకపోయాను. ఏమనుకోవుగా" అంది రవళి.

"నాకు తెల్సులే అక్కా. సంజాయిషీ యివ్వాల్సిన అవసరం లేదు. ఐనా సుధాకర్ గారు పక్కనుండి నువ్వులేని లోటుని తీర్చేశారులే" అంది.

రైలు కదిలేముందు నాతో చేయికలుపుతూ "చాలా థ్యాంక్స్... వైజాగ్ అందాల్ని దగ్గరుండి చూపించినందుకు" అంది.

"మీకే థ్యాంక్స్. మామూలు చూపుకి మనసున్న చూపుకి మధ్యఉన్న అనంతమైన వ్యత్యాసాన్ని అర్థమయ్యేలా చెప్పినందుకు" అన్నాను.

* * *

ఆదివారం సాయంత్రం... రామకిష్ణాబీచ్‌లో వేయించిన పల్లీలు తింటూ నేనూ రవళి...

"ఎంత పెద్దకళ్లో... ముద్దమందారాల్లా" అంది.

"యిన్నాళ్ళూ నేనూ గర్వపడ్డాను. కానీ మనస్వితని చూశాక నా అభిప్రాయం మార్చుకున్నాను. కళ్ళున్నందుకు ఎలాచూడాలో నేర్పింది తను... హృదయానికి చూపున్నట్టు... కళ్ళుండటమో... అరచేయంత వెడల్పాటి అందమైన కళ్ళుండటమో కాదు ముఖ్యం. ఆ కళ్ళతో ఏం చూస్తున్నామనేదే ముఖ్యం... ఎలా చూస్తున్నామనేదే ముఖ్యం. నేనో విషయం చెప్పనా... నువ్వు నమ్మవు కానీ మనస్వితకి కళ్ళున్నాయి... మనమే కళ్ళున్నా కళ్ళు లేని అంధులం" అన్నాను.

**(సురభి మాసపత్రిక - అక్టోబర్ 2010)**